సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

సంతలో షాపింగ్

- మాల్స్ ఎన్ని వచ్చినా తరగని ఆదరణ
- ఒక్క రోజులోలక్షల్లో వ్యాపారం
- చిరు వ్యాపారులకు జీవనాధారం
- తక్కువ ధరల్లో వస్తువులు లభ్యం
- వినియోగదారులకూ సౌకర్యం

వస్తువులన్నీ ఒకే చోట..



సంతలో కొనుగోలు దారుల సందడి

కాలం మారినా.. అవసరాలు మారుతున్నా.. మనిషి కదలకుండానే షాపింగ్ చేసే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా.. వారాంతపు సంతలకు క్రేజ్ ఎక్కడా తగ్గలేదు. అవసరమైన అన్ని సరకులు ఒకే చోట, తక్కువ ధరలకే లభిస్తుండటంతో చుట్టు పక్కల ప్రాంతాల వారు వందలాదిగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అటు వ్యాపారులకు, ఇటు కొనుగోలుదారులకు కూడా ఉభయ కుశలోపరిగా ఈ సంతలు ఆదరణ పొందుతున్నాయి. అందుకే సంతలు ఏర్పాటు చేసే రోజుల్లో, ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంటోంది.

కొమ్మాది: కాలం మారింది, కాలంతో పాటు మనుషులు, వారి అవసరాలూ మారాయి. అందుకు అనుగుణంగా మార్కెట్లు సూపర్ మార్కెట్లుగా, మాల్స్‌గా, భారీ షాపింగ్ మాల్స్‌గా అవతరించి, అవసరమైన అన్ని వస్తువులు ఒకే దగ్గర లభించే విధంగా ఇప్పుడు ఉన్నాయి. ఇక ఆన్‌లైన్ వ్యాపారాల పుణ్యమాని ఒక్క బటన్ నొక్కితే కాళ్ల వద్దకే ఏ వస్తువైనా వచ్చే పరిస్థితి. అయినప్పటికీ సంతలకు ఆదరణ మాత్రం అలానే ఉంది.

దినదినాభివృద్ధి జరుగుతున్న విశాఖ నగర శివారులోని ఎండాడ, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో నిర్వహించే వారాంతపు సంతలకు ప్రజాదరణ ఇప్పటికీ తగ్గలేదు. ఆ వారం వచ్చిందంటే ఇక్కడ పండగ వాతావరణం నెలకొంటుంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ప్రాంతాల్లో సంత నిర్వహిస్తారు. రుషికొండ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎండాడ, సుభాష్‌నగర్, శాంతినగర్, దుర్గానగర్, గుడ్లవానిపాలెం, ముబారక్‌కాలనీ, ముసలయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది సంతకు వచ్చి, వారికి అవసరమైన సరకులను కొనుగోలు చేసుకుంటారు.



సంతలో కోలాహలం

వెయ్యికి పైగా రకాలు.. లక్షల్లో వ్యాపారం

వారాంతపు సంతలో కూరగాయలు, పండ్లు, బట్టలు, ప్లాస్టిక్ సామాన్లు, ఫుడ్ ఐటమ్స్, మసాలా దినుసులు, పువ్వులు, ఫ్యాన్సీ, మొక్కలు, చెప్పులు, ఆట బొమ్మలు, చేపలు, పూజా సామాగ్రి వంటి నిత్యావసరాలు ఇలా ఒకటి కాదు వెయ్యికి పైగా రకాల వస్తువులన్నీ ఒకే దగ్గర దొరుకుతాయి. సామాన్యుడి నుంచి ధనవంతుల వరకు ఇలా జాలీగా వచ్చి



ఎండాడ సంతలో నిత్యావసర సరకుల దుకాణం

వారాంతపు సంతలో సామగ్రి కొనాల్సిందే. ఒక్కరోజులో రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వ్యాపారం జరుగుతుంది అంటే అతిశయోక్తి కాదు. నగరం నుంచి అనేక మంది వ్యాపారులు వారాంతపు సంత రోజు మూడు గంటలకు చేరుకుని రాత్రి 10 గంటల వరకు వ్యాపారం చేస్తారు.

ధరలు తక్కువే..

సంతలో వస్తువులు, మాల్స్‌లో దొరికే వస్తువులకన్నా తక్కువ ధరకే లభిస్తాయి. ఎందుకంటే



సంతలో బట్టల వ్యాపారం

ఇక్కడ పన్నులు గానీ, అద్దెలు గానీ ఉండవు. వర్కర్స్ ఉండరు. కుటుంబంతో కష్టబడి లాభం ఎంత వచ్చినా చాలు అనే విధానంతో వీరు ఉండటంతో ధరలు తక్కువగా ఉంటాయి. మాల్స్‌లో అయితే అక్కడ చెప్పే ధరకే కొనాలి, ఇక్కడైతే బేరం ఆడే అవకాశం ఉండటంతో ఇప్పటికీ ఈ సంతల్లో వ్యాపారం కొనసాగటానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా నేటి పోటీ ప్రపంచంలో సంతలకు ప్రాధాన్యత తగ్గలేదనేది వాస్తవం.

వ్యాపారం బాగుంటుంది

వారంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట సంత జరుగుతుంది. మేము అక్కడకు వెళ్లి వ్యాపారం చేస్తుంటాం. ఎన్ని షాపులు ఉన్నా మా వ్యాపారానికి ఇప్పటి వరకు ఎక్కడా నష్టం లేదు దీనికి ఉండే ఆదరణ దీనికి ఉంది. ఈ సంతలను నమ్ముకుని నగరంలో వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాం.

– శంకర్రావు, బొమ్మల వ్యాపారి, డాబాగార్డెన్స్

సంతే ఆధారం

సొంతంగా షాపులు లేనివారికి, అద్దెలు కట్టి వ్యాపారం చేయలేని వారికి ఈ సంతలే జీవనాధారం. సంతలకు ప్రాధాన్యత తగ్గక పోవడంతో ఇప్పటికీ మా వ్యాపారాలు సాగుతున్నాయి. తక్కువ ధరలకే ఇక్కడ అన్ని రకాల సామానులు లభిస్తాయి.

– ఎం.ఆదినారాయణ, బట్టల వ్యాపారి, విశాలాక్షినగర్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



భద్రయ్యపేటలో ప్రజలతో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

పద్మనాభం: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేటలో శుక్రవారం పర్యటించిన ఆయన కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్నవారంతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కేజీహెచ్ దూరం కావడంతో వైద్యం కోసం వెళ్లేందుకు కిడ్నీ రోగులు ఇబ్బంది పడుతున్నారని, సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకో వాలని కోరారు. ప్రజలు కిడ్నీ వ్యాధిబారిన పడడానికి గల కారణాలను కనుక్కొని నివారణ చర్యలు చేపట్టాలని, దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ముందుగా ఆయన రెడ్డిపల్లి సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలను కార్యదర్శి నూర్జహాన్‌ను అడిగి తెలుసుకున్నారు.

చిన్నశ్రీను దృష్టికి సమస్యలు

స్థానికులు తమ సమస్యలను చిన్నశ్రీను దృష్టికి తీసుకువెళ్లారు. దూరంగా ఉన్న రెడ్డిపల్లి రేషన్ డిపోకు వెళ్లి సరకులు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలపగా, ఆయన తహసీల్దార్ ఆనందరావుతో ఫోన్‌లో మాట్లాడారు. భద్రయ్యపేటలో రెండు రోజులు సరకులు ఇచ్చేవిధంగా, లేదా దగ్గరగా ఉన్న సుంకరపేటలో సరకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

– గ్రామంలో సింగిల్ ఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల తరచూ కరెంటు పోతోందని ఫిర్యాదు చేయడంతో, దీనిపై విద్యుత్ ఏఈ జగన్మోహనరావుతో ఫోన్‌లో మాట్లాడి,సమస్య పరిష్కరించాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, నాయకులు ఆదినారాయణ, ఈశ్వరరావు, వర్మ,బంగారప్పడు,సూరప్పడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.10 లక్షల ఎంపీపీ నిధులతో బోరుబావులు



తర్లువాడలో బోరుబావి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వెంకటరావు

తగరపువలస: ఆనందపురం ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక రూ.10 లక్షల నిధులు వెచ్చించి శుక్రవారం ఐదు పంచాయతీలలో ఎనిమిది చోట్ల బోరు బావుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తర్లువాడ రామాలయం వద్ద బోరుబావి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇంకా భీమన్నదొరపాలెంలో 2, రామవరంలో 1, కణమాంలో 3, కోలవానిపాలెంలో 1 బోరుబావి నిర్మించనున్నారు.

క్లాప్ డ్రైవర్ల నిరసన

మధురవాడ: క్లాప్ వాహనాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని క్లాప్ డ్రైవర్లు శుక్రవారం నిరసన చేపట్టారు. మారికవలస ఆర్‌జీకే కల్యాణ మండపం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. క్లాప్ వాహనాల డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె. సన్ని, ఎం. రాజు మాట్లాడుతూ క్లాప్ వాహనాలను ఇప్పటి వరకు ద్రోణంరాజు కల్యాణ మండపం, మారికవలస రాజీవ్ గృహకల్ప కల్యాణ మండపాల వద్ద నిలిపేవారమని, ఇప్పుడు జెడ్పీ కల్యాణ మండపాల గేట్లకు తాళాలు వేయించడంతో వాహనా లు ఎక్కడ నిలపాలో తెలియడం లేదన్నారు.సీఐటీయూ నాయకులుడి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, బి.అప్పలరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెం హైస్కూల్లో జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు, సెలక్షన్స్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎంఆర్ కప్ పేరిట 3రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జూనియర్ బాల బాలికల జట్టు ఎంపిక నిమిత్తం నిర్వహిస్తున్న పోటీలను జిల్లా అధ్యక్షుడు సునీల్ మహంతి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు

యువతి అదృశ్యం

భీమునిపట్నం: భీమిలి ఎగువపేటకు చెందిన యువతి అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి ఇంట్లో పడుకున్న ఎగువపేటకు చెందిన 19 సంవత్సరాల యువతి గురువారం ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. దీనిపై యువతి తల్లి శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గీతంలో ఘనంగా 'ఎచీవర్స్ డే'

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎచీవర్స్ డే (విజేతల దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. రికార్డు స్థాయిలో 1707 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో పాటు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి ప్రవేశాలు సాధించడంతో ఎచీవర్స్ డేను నిర్వహించారు. ఐటీ సంస్థ ఏటీ అండ్ ఎస్‌టీ మానవ వనరుల విభాగం డైరెక్టర్ ప్రగతి కుమార్ ఆచంట ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు ఉద్యోగ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, గీతం ప్రో వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మూడిళ్లతో మమ

- తూతూమంత్రంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

కొమ్మాది: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు టీడీపీ నాయకులు. జీవీఎంసీ 4వ వార్డు జీవీ అగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికులు నానా ఇబ్బందులు పడి, ఏదో విధంగా జనాన్ని తీసుకునివచ్చారు. అయితే, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఆయన వచ్చారు.. మూడు ఇళ్లు తిరిగి కార్యక్రమాన్ని మమ అనిపించడంతో స్థానిక టీడీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం అనంతరం వార్డులో నిర్మించనున్న రోడ్లు, డ్రైయిన్‌లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఎండాడలో కమిషనర్ పర్యటన

రోడ్డుపై ఆక్రమణల తొలగింపునకు ఆదేశం



ఎండాడలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కొమ్మాది: రోడ్లు ఆక్రమించిన నిర్వహిస్తున్న వ్యాపారాలను వెంటనే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. 8వ వార్డు ఎండాడలో శుక్రవారం పర్యటించిన ఆయన, అక్కడ ప్రధాన రహదారిలో రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను గమనించి, వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇక్కడ వ్యాపారులతో మాట్లాడుతూ పరిధి దాటి రోడ్డుపై వ్యాపారం చేయడం నేరమని, వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఎండాడ నుంచి రుషికొండ వరకు పలు చోట్ల రోడ్డుకు ఇరువైపులా బీటీ రోడ్లు లేనందున కొన్ని చోట్ల ఆక్రమణలు జరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, బీటీ రోడ్డుతో పాటు కాలువలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు గ్రీన్ మ్యాట్స్ ఉండేలా చూడాలని, భవన నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయకుండా చూడాలని సూచించారు. వార్డు ప్లానింగ్ కార్యదర్శులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్‌రావును ఆదేశించారు. అనంతరం ఎండాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ పనికిరాని వస్తువులతో తయారు చేసిన ఆట పరికరాలు, ఎక్విప్‌మెంట్ ఆకర్షణీయంగా ఉన్నాయని అయితే వాటి రంగులు వెలిసిపోయినందున, మళ్లీ రంగులతో తీర్చిదిద్ది పిల్లలు ఆడుకునేందుకు అందుబాటులోకి తీసుకురావాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి సూచించారు.

అనిట్స్‌లో సీ2ఎస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రధానాచార్యులు రాజ్యలక్ష్మి

తగరపువలస: సంగివలస అనిట్స్‌లో ఈసీఈ విభాగంలో భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆర్థిక సాయంతో ఎలక్ట్రానిక్ ఐ.సి (చీఫ్ డిజైన్) తయారు చేసే సాఫ్ట్‌వేర్ కేంద్రాన్ని ప్రధానాచార్యులు వి.రాజ్యలక్ష్మి, పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ కాల్వ శ్రీరామకృష్ణ శుక్రవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సి2ఎస్ కేంద్రం ద్వారా టెక్నాలజీ స్టార్టప్‌లకు, పరిశోధనలకు, ప్రతిభ కలిగిన యువ విద్యార్థులకు ఐసీ డిజైన్‌లో ఆధునిక వనరులు అందిస్తుందన్నారు. డైరెక్టర్ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ దీని ద్వారా ప్రతిభ గల విద్యార్థులకు వీఎల్ఎస్ఐ డిజైన్‌లో ఉపాధి కల్పించవచ్చన్నారు. ఈసీఈ విభాగాధిపతి బండి జగదీష్ మాట్లాడుతూ కేంద్రం ప్రారంభించేందుకు కృషి చేసిన ప్రధాన పరిశోధకుడు మురుగ పాండ్యన్, శ్రీనివాస్‌లను అభినందించారు. వివిధ విభాగాధిపతులు, ఈసీఈ అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణపై మరింత అవగాహన

క్షయ నివారణ అధికారి రమేష్



మిథిలాపురి వుడా కాలనీ యూపీహెచ్‌సీలో సూచనలు ఇస్తున్న డాక్టర్ రమేష్

మధురవాడ: కుష్టు, క్షయ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా లెప్రసీ అండ్ క్షయ నివారణ అధికారి డాక్టర్ రమేష్ సూచించారు. స్క్రీనింగ్‌కు మరిన్ని పరీక్షలు చేయాలన్నారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని యూపీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన ఆయన అక్కడ వైద్య పరీక్షలపై ఆరా తీశారు. టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా టెస్ట్‌లు, అవగాహన కార్యక్రమాలు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యులు సలోమి, సూపర్‌వైజర్ వీర బ్రహ్మం పాల్గొన్నారు.

స్వతంత్రనగర్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు

టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా స్వతంత్ర నగర్ యూపీహెచ్‌సీలో శుక్రవారం టీబీ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 50మందికి వైద్య పరీక్షలు చేశారు. 30మంది నుంచి కఫం నమూనాలు సేకరించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి మానస ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వీరబ్రహ్మం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.2 లక్షల సామగ్రి వితరణ



రూ.2 లక్షల సామగ్రి అందించిన ఐడీబీఐ బ్యాంక్ జీఎంను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

పీఎం పాలెం: బక్కన్నపాలెం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ మధురవాడ బ్రాంచి సుమారు రూ.2 లక్షల విలువచేసే 3 కంప్యూటర్లు, 2 బీరువాలు, 30 కుర్చీలు 1 ప్రింటర్, 3 ఫ్యాన్లు, సౌండ్ సిస్టంను అందజేసింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ జీఎం కన్నవేబ్ దానును ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. స్థానిక బ్యాంక్ మేనేజర్లు ఆర్.సింహాచలం, పి.కిరణ్, సతీష్, హెచ్ఎం నారాయణరావు, కమిటీ చైర్మన్ పి. దివ్య పాల్గొన్నారు.

ఓట్ల కోసం మోసాలు బాబుకు వెన్నతో పెట్టిన విద్య



కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకారులు



అన్నవరంలో మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను
- భీమిలి మండలం అన్నవరంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'

తగరపువలస: ఓట్ల కోసం ప్రజలను మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం సాయంత్రం భీమిలి మండలం అన్నవరంలో మత్స్యకారుల గడప గడపకు వెళ్లి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు చంద్రబాబు, పవన్‌లు సంతకాలు చేసి బాండ్లు ఇచ్చి నెరవేర్చని హామీల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయుని విగ్రహం వద్ద ఆయన మత్స్యకారులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన వైఎస్ జగన్ నవరత్నాలతో పాటు 30 సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందించారన్నారు. మోసకారి బాబు పవన్‌తో కలిసి జగన్ అందించిన 30 సంక్షేమ పథకాలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలందిస్తామని రాష్ట్ర ప్రజలను బురిడీ కొట్టించారన్నారు. 50 ఏళ్లకే పెన్షన్, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి వంటి పథకాల ఊసే లేదన్నారు. ఏడాదిగా ఒక్క కొత్త పెన్షన్ కూడా కూటమి ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఆరు మాసాలకు కొత్త పెన్షన్లు అందించారన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌దన్నారు. వలంటీర్లకు రెట్టింపు పారితోషికం అందించి కొనసాగిస్తామని వారిని కూడా మోసగించారన్నారు. అంతకు ముందు స్థానిక రామాలయంలో, మత్స్యకారుల గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రమాదానికి గురై, ఏడాదిగా కూటమి ప్రభుత్వంలో పెన్షన్‌కు నోచుకోని ఉమ్మిడి తోటయ్యకు రూ.60వేల విలువైన బ్యాటరీ ట్రై సైకిల్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో మేరుగు ఎల్లాజీ, దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, బంక సత్యం, సరగడ రఘునాథరెడ్డి, మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సురపతి దుర్గాలమ్మ, అప్పలరాజు, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, బొడ్డు దుర్గారావు, శిరిగుడి ఈశ్వరరావు, తోట ఎల్లారావు, సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య దేవి చిట్టి, మద్దిల శివకుమార్, దూడ ధనంకొండ, దుంపల ప్రభాకర్, పిన్నింటి వెంకటరమణ, వెంపాడ సూరిబాబు, సరగడ రాంబాబు, కొయ్య రమేష్‌రెడ్డి, చెల్లూరు సంతోష్ , కోరాడ ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ముగిసిన అభిప్రాయ సేకరణ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోనల్ అధికారులు శుక్రవారం చిట్టివలసలో నిర్వహించిన రహదారులపై అభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా ముగిసింది. ప్రజలందరికీ సమాచారం ఇవ్వకుండానే, కొద్దిమంది కూటమి నాయకులను పిలిచి మమ అనిపించారు. భీమిలి పోలీస్ స్టేషన్ నుంచి తగరపువలస కూడలి మీదుగా బంగ్లామెట్ట అవుట్ పోస్టు వరకు 80 అడుగులకు రహదారిని విస్తరించనున్నట్లు జెడ్పీ అయ్యప్పనాయుడు ప్రతిపాదించగా చాలా మంది 60, 65, 70 అడుగులు చాలని తమ అభిప్రాయాలు తెలియజేశారు. మొత్తం మీద అభిప్రాయ సేకరణ మీడియాకు కూడా తెలియకుండా కొద్దిమంది కూటమి నాయకులు, వర్తకులతో ముగించారు. అభిప్రాయ సేకరణ జరుగుతున్నట్టు చాలామంది తెలియదన్నారు. పత్రికల ద్వారా సమాచారం అందించి, మళ్లీ సేకరణ చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్ట్

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో ఇటీవల జరిగిన చోరీ కేసులో దొంగను పద్మనాభం క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. శేరిఖండం గ్రామంలో ఈ నెల 21వ తేదీన సంగు అమ్మాజీ ఇంట్లో నగదు చోరీ జరిగింది. ఈ చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్ల నూకరాజును మద్ది జంక్షన్‌లో పట్టుకుని, అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

నగరపాలెంలో వసతులకు దివీస్ వితరణ



చెక్కు అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: టి.నగరపాలెం పంచాయతీలో వసతుల కల్పనకు దివీస్ లేబొరేటరీ యాజమాన్యం ముందుకు వచ్చింది. గోస్తనీనది ఒడ్డున చిల్డ్రన్స్ పార్క్ నుంచి గొల్లల పాలెం ప్రభుత్వ పాఠశాల వరకు కొత్త విద్యుత్ స్తంభాలు, లైన్ ఏర్పాటుకు రూ. 3,67,088 చెక్కు అందించింది. గ్రామ సచివాలయానికి కంప్యూటర్, యూపీఎస్, ప్రింటర్ అందించారు.

శ్రావణ లక్ష్మీ.. నమోస్తుతే



మద్దిలోని సాగర దుర్గ ఆలయంలో పూజలు



పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన చేస్తున్న మహిళలు



రూ.3.8 లక్షల కరెన్సీ నోట్ల అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి




విశేష అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ

అమ్మవారి ఆలయాలు శ్రావణశోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. భీమిలిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు రూ 3.80లక్షల నోట్లతో అలంకరించారు. చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ, కారుషెడ్ బబ్బేలమ్మ, శృంగేరీ శంకరమఠంలోని శారదాంబ, మద్దిలోని సాగరదుర్గ, అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అష్టలక్ష్మీ ఆలయంలో లోకకల్యాణం కోసం హోమం నిర్వహించారు.

– పీఎం పాలెం/మధురవాడ/కొమ్మాది/పద్మనాభం/భీమునిపట్నం



పుష్పాలంకరణలో కారుషెడ్ బబ్బేలమ్మ



అష్టలక్ష్మీ ఆలయంలో పూజలందుకున్న లక్ష్మీదేవి